## క్లుప్తంగా

### కృష్ణాష్టమి వేడుకలను విజయవంతం చేయండి



జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులను ఆహ్వానిస్తున్న ప్రభోదసేవా సమితి సభ్యులు

వి.కోట: ఈ నెల 6 నుంచి 14వ తేదీ వరకు మండలంలోని రామాపురంలో నిర్వహించే కృష్ణాష్టమి వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరు కావాలని జెడ్పీ చైర్మన్‌ను శ్రీనివాసులును ప్రభోద సేవా సమితి సభ్యులు ఆహ్వానించారు. ఆదివారం జెడ్పీ చైర్మన్‌ను ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. 14న స్వామి వారి ఊరేగింపు కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో ప్రభోద సేవా సమితి మండల అధ్యక్షులు అశోక్‌బాబు, సభ్యులు దిలీప్, సంతోష్, హరి, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

### 6, 7న కృష్ణాష్టమి వేడుకలు

పుంగనూరు: పట్టణ సమీపంలోని శ్రీకృష్ణాలయంలో ఈనెల 6, 7వ తేదీలలో నిర్వహించనున్న గోకులాష్టమి వేడుకలకు ప్రతి ఒక్కరూ రావాలని పీకేఎం ఉడా చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్ కోరారు. ఆదివారం రాత్రి ఆయన విలేకరులతో మాట్లాడుతూ, కృష్ణాష్టమి వేడుకలను ఆలయంలో వైభవంగా నిర్వహించి, అన్నదానం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

### మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



నగదు అందజేస్తున్న నాయకులు

శాంతిపురం: మండలంలోని అబకలదొడ్డి పంచాయతీ వెంకటేష్‌పురంలో అనారోగ్యంతో మృతి చెందిన కృష్ణప్ప కుటుంబానికి ఎమ్మెల్సీ భరత్ రూ 10వేల ఆర్థిక సాయాన్ని స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులత చేతుల మీదుగా మృతుడి భార్య రమణమ్మకు ఆదివారం నగదు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మురుగేష్, మంజునాథ్, వీరప్ప, గోవిందప్ప, రాధాకృష్ణ పాల్గొన్నారు.

### ప్రకృతి వ్యవసాయానికి ప్రాధాన్యం



విత్తనాలు పంపిణీ చేస్తున్న నాయకులు

సోమల: రైతులు ప్రకృతి వ్యవసాయానికి ప్రాధాన్యం ఇవ్వాలని ఎంపీపీ ఈశ్వరయ్య కోరారు. మండలంలోని కందూరు పంచాయతీ మిట్టపల్లెలో పలువురు రైతులకు వివిధ రకాల విత్తనాలను ఆదివారం ఆయన పంపిణీ చేసి మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచ్ బాషా మసూద్, ఏఎంసీ మాజీ చైర్మన్ నాగేశ్వరరావు, రెడ్డికుమారి, రెడ్డిరాణి, మనోహర్‌నాయుడు, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.


### కనుల పండువగా మహా కుంభాభిషేకం



కలశ ప్రతిష్ఠాపన చేస్తున్న వేదపండితులు

వెదురుకుప్పం: మండలంలోని ముసలయ్యగారిపల్లిలో వెలసిన గంగమ్మతల్లి మహాకుంభాభిషేకాన్ని ఆలయ సిబ్బంది మునిరాజులురెడ్డి, వెంకటేష్, రామ్మూర్తి ఆధ్వర్యంలో కనులపండువగా నిర్వహించారు. ఈ మహా కుంభాభిషేకంలో ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం ఆలయ సిబ్బంది ఆయనకు ప్రత్యేక దర్శనం ఏర్పాటు చేశారు. అర్చకులు వినాయకుడికి ప్రత్యేక పూజలు చేసి, అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. భక్తులకు అన్నదానం చేశారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

### మసీదుకు గ్రానైట్ వితరణ



బంగారుపాళెం: మండల కేంద్రంలోని జామియా మసీదుకు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి గ్రానైట్ వితరణగా అందజేశారు. గత ఏడాది బంగారుపాళెం పర్యటనకు వచ్చిన సందర్భంగా ముస్లింల ఆహ్వానం మేరకు పెద్దిరెడ్డి జామియా మసీదును సందర్శించారు. తన సొంత నిధులతో మసీదుకు గ్రానైట్ అందిస్తానని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం మసీదుకు గ్రానైట్ అందజేసిన మంత్రికి మండల ముస్లింలు కృతజ్ఞతలు తెలిపారు.

## గ్రామీణులకు వరం..
# ఇంటి ముంగిటకే వైద్యం

- 2వేల మంది జనాభాకో వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్
- ప్రస్తుతం గ్రామాల్లో 104 సేవలు
- అందుబాటులో 14రకాల డయాగ్నోస్టిక్ రాపిడ్ కిట్స్
- ఇంటి వద్దే వైద్యపరీక్షలు, చికిత్స, 67 రకాల మందులు
- ఎంతో సౌకర్యంగా ఉందంటున్న దీర్ఘకాలిక రోగులు



గంగవరం మండలంలోని గ్రామాల్లో ఫ్యామిలీ డాక్టర్ సేవలు

పలమనేరు: ఫ్యామిలీడాక్టర్ సేవలు మరింతగా విస్తరిస్తున్నాయి. ఇందులో భాగంగా పలమనేరు నియోజకవర్గంలో ఎనిమిది ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలున్నాయి.(బైరెడ్డిపల్లె-2, గంగవరం-2, పలమనేరు, వీకోట, పెద్దపంజాణిలలో ఒక్కొక్కటి) ఒక్కో ఆరోగ్యకేంద్ర పరిధిలో ఓ 104 వాహనం సేవలందిస్తోంది. వైద్యులు నెలలో రెండు పర్యాయాలు ప్రతి గ్రామానికీ వెళ్లి వైద్య సేవలు అందిస్తున్నారు.

**దీర్ఘకాలిక రోగులకు, మంచానికే పరిమితమైన వారికి చాలా మేలు**

దీర్ఘకాలిక వ్యాధులైన మధుమేహం, రక్తపోటు, క్యాన్సర్, మోకాలి నొప్పులతో బాధపడుతున్న వారు గ్రామాల నుంచి వారానికోసారి పట్టణానికి వచ్చి వైద్యం చేసుకోవడం కష్టంగా మారింది. ఇక కొందరు రోగులు ఇంట్లో బెడ్‌కే పరిమితమై ఉంటున్నారు. వీరికి కుటుంబీకుల తోడు లేకుంటే కుదరదు. ఇక వృద్ధులు వృద్ధాప్య సమస్యలతో ఇళ్లవద్ద ఇబ్బందులు పడుతుంటారు. వీరికి బీపీ, షుగర్ లాంటి పరీక్షలు తరచూ చేయాల్సింటుంది. ఇలాంటి వారికి ఫ్యామిలీ డాక్టర్ సేవలు ఇళ్ల ముంగిటకే అందుతున్నాయి.

**ముఖ్యమైన టెస్ట్‌లన్నీ ఇంటి వద్దే**

అలాగే, 14 రకాల టెస్ట్‌లు చేసి ఫలితాలను అప్పటికప్పుడే చెబుతున్నారు. షుగర్, బీపీ, మలేరియా, వైరల్ ఫీవర్స్, డెంగీ, హైచ్‌ఐవీ, మూత్రపరీక్షలతో పాటు గుండెకు సంబంధించిన ఈసీజీ సైతం వాహనంలో అందుబాటులో ఉంటుంది. ఆయా గ్రామాలకు వెళ్లి ఉదయం 9 నుంచి 12 వరకూ దాకా జనరల్ ఓపీ చూస్తారు. ఆ తర్వాత ఆ గ్రామంలో బెడ్‌పై ఉన్న రోగులకు చెకప్‌లుంటాయి. సాయంత్రం అదే గ్రామంలోని బడి, అంగన్‌వాడీలో పిల్లలకు అవసరమైన వైద్యసేవలుంటాయి. ఇందుకు సంబంధించి టెక్నికల్ స్టాఫ్ సైతం ఉన్నారు.





గుండుగల్లులో బాలింత స్వాతితో మాట్లాడుతున్న వైద్య సిబ్బంది

- గంగవరం మండలంలోని గుండుగల్లుకు చెందిన స్వాతి గర్భం దాల్చాక గ్రామంలోనే 104 ద్వారా ఆమెకు అవసరమైన వైద్యసేవలందాయి. ప్రసవ నొప్పుల వేల 108లో పలమనేరు ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి వైద్యులు ఆమెకు సుఖప్రవసం చేసి, తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌లో ఇంటికి చేర్చారు. ప్రస్తుతం ఆమెకు అవసరమైన వైద్య సేవలు ఫ్యామిలీ డాక్టర్ ద్వారా అందుతున్నాయి. దీంతో ఈ సేవలు తమలాంటి మారుమూల గ్రామాల్లోని వారికి చాలా బాగున్నాయని ఆనందంగా చెబుతోంది.



మామడుగులో మంచంపై ఉన్న అహ్మద్‌బాషాకు వైద్యసేవలందిస్తున్న డాక్టర్ మల్లికార్జున రెడ్డి

- నియోజకవర్గంలోని గంగవరం మండలం మామడుగుకు చెందిన అహ్మద్‌బాషా ఇటీవల గుండెనొప్పితో బాధపడుతూ ఆరోగ్యశ్రీ పథకం కింద తిరుపతి స్విమ్స్‌లో శస్త్రచికిత్స చేయించుకుని ప్రస్తుతం తన ఇంట్లో ఉంటున్నాడు. ఆయన ఇంతకుముందు మందులు, బీపీ, షుగర్ పరీక్షలకు పలమనేరుకు వచ్చేవాడు. అయితే వైస్సార్ సీపీ ప్రభుత్వం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టాక డాక్టర్, వైద్యసిబ్బంది గ్రామాల బాట పట్టారు. ప్రజలకు ఆరోగ్య పరీక్షలు చేయడంతోపాటు మంచానికే పరిమితమై ఇళ్లలో ఉన్న దీర్ఘకాలిక రోగులకు వైద్యసేవలు అందివ్వడం..తనలాంటి వారికి ఎంతో మేలు కలిగిందని అహ్మద్‌బాషా ఆనందం వ్యక్తం చేస్తున్నాడు.

**ఇదో మంచి విధానం**



గ్రామాలకు వెళ్లి రోగులను పరీక్షించి వైద్యం చేస్తున్నాం. ముఖ్యంగా దీర్ఘకాలిక వ్యాధుల రోగులు, వృద్ధులు, బెడ్‌పై ఉన్నవారికి ఈ సేవలు చాలా ఉయయుక్తం. రాబోవు రోజుల్లో గ్రామంలోని ప్రతి ఇంటి సభ్యులు డాక్టర్‌కు బాగా పరిచయమై వారికి అవసరమైన వైద్య సేవలను ఫ్రెండ్లీగా పొందడం ఖాయం. -డాక్టర్ మల్లికార్జున రెడ్డి, మెడికలాఫీసర్, పత్తికొండ పీహెచ్‌సీ

### ఆలయ నిర్మాణానికి విరాళం



విరాళం అందజేస్తున్న విజయమ్మ

బైరెడ్డిపల్లె: మండలంలోని ఎం.కొత్తూరులో నూతనంగా నిర్మిస్తున్న నడివీధి గంగమ్మ ఆలయ నిర్మాణ పనులకు గడ్డూరు గ్రామానికి చెందిన విజయమ్మ ఆదివారం రూ.లక్ష విరాళంగా అందజేశారు. గ్రామస్తులు ఆమెను ఘనంగా సత్కరించారు. ఆలయ నిర్మాణ పనులకు తమ వంతు సహాయం చేసినట్లు విజయమ్మ చెప్పారు.

### మరో నాలుగు రోజులు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పలమనేరు: పలమనేరు నియోజకవర్గంలో సాగుతున్న చెన్నై- బెంగళూరు ఎక్స్‌ప్రెస్ హైవే పనుల కారణంగా రోడ్ల క్రాసింగ్ లైన్ల పనుల దృష్ట్యా ఈనెల 8వ తేదీ వరకు అప్పుడప్పుడూ సంబంధిత ప్రాంతాల్లో కరెంట్ సరఫరాకు అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని స్థానిక ట్రాన్స్‌కో ఏడీ చిన్నబ్బ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు.

### వలంటీర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

సోమల: మండలంలో ఖాళీగా ఉన్న వలంటీరు పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఎంపీడీఓ నాగరాజు ఆదివారం తెలిపారు. వల్లిగట్ల పంచాయతీలో 3, కందూరు 1, నెల్లిమంద1, సోమల 1, దిడ్డివారిపల్లె 1 పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఆయన చెప్పారు. ఈనెల 6వ తేదీ లోపు అర్హులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. 11న ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు.

# పంచలోహ విగ్రహాల వితరణ



పంచలోహ విగ్రహాలు అందజేస్తున్న తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

తిరుపతి రూరల్: ఆధ్యాత్మిక వాతావరణంతో పల్లెలు ప్రశాంతంగా ఉంటాయని తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి అన్నారు. ప్రతి పల్లెలోనూ ఆధ్యాత్మిక చింతన ఉద్దీపనకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ఆయన ఆదివారం చిన్నగొట్టిగల్లు మండలం టి.చట్టేవారిపాలెం పంచాయతీ నలపరెడ్డిగారిపల్లె రామాలయానికి సీతారాములు సమేత లక్ష్మణ, ఆంజనేయస్వామి పంచలోహ విగ్రహాలను వితరణ చేశారు. వాటిని ఆదివారం తుమ్మలగుంటలో ఆలయ నిర్వాహకులకు అందజేశారు. ఇటీవల గ్రామంలో నిర్వహించిన మహా పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు మోహిత్ రెడ్డి ఈ పంచలోహ విగ్రహాలను తయారు చేయించారు. ఆయన మాట్లాడుతూ, సంస్కృతీ సంప్రదాయాలకు పల్లెలు పట్టుకొమ్మలుగా నిలుస్తున్నాయన్నారు. గ్రామ ప్రజలందరూ ఐకమత్యంగా నిర్వహించుకునే వేడుకల్లో శ్రీరామ భజనలు, సీతారామ కల్యాణం, పట్టాభిషేకం వంటివి ఉంటాయన్నారు. నలపరెడ్డిగారి పల్లె ప్రజలు కలిసికట్టుగా రామాలయం నిర్మించుకోవడం అభినందనీయమన్నారు. సోమవారం ఆలయ ప్రారంభోత్సవానికి తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డిని నిర్వహకులు ఆహ్వానించారు. కార్యక్రమంలో చిన్నగొట్టిగల్లు జెడ్పీటీసీ స్వరూప, వైఎస్సార్ సీపీ నాయకులు మనోహర్, భాను ప్రకాష్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, విశ్వనాథరెడ్డి, భాస్కర్ రెడ్డి, సచివాలయం కన్వీనర్ రఘునాథ, బాలసుబ్రహ్మణ్యం, మునిరామ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# భక్తిప్రపత్తులతో విగ్రహ ప్రతిష్ఠాపన



ఎమ్మెల్యే వెంకటేగౌడని సత్కరిస్తున్న గ్రామస్తులు

గంగవరం: మండలంలోని తమ్మిరెడ్డిపల్లెలో శ్రీ వరసిద్ధి వినాయకస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి పూజలు, హోమం, కైంకర్యాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో వినాయకుని దర్శించారు. కార్యక్రమంలో పలమనేరు ఎమ్మెల్యే వెంకటేగౌడ స్థానిక నాయకులతో కలిసి పాల్గొన్నారు. ఆయన్ను గ్రామస్తులు శాలువాతో సత్కరించారు. పార్టీ మండల కన్వీనర్ మోహన్‌రెడ్డి, నాయకులు చంద్రప్ప, గిరిరాజారెడ్డి, చలపతిరెడ్డి, రమేష్‌రెడ్డి, వినోద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఆలయంలో ప్రతిష్ఠించిన వినాయకస్వామి

# స్వర్ణరథంపై శివపుత్రుని కటాక్షం



భక్తులతో నిండిపోయిన క్యూలు



స్వర్ణ రథంపై విహరిస్తున్న గణనాథుడు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆదివారం రాత్రి స్వర్ణ రథంపై ఆలయ మాడవీధుల్లో విహరించారు. సంకటహర చతుర్థి గణపతి వ్రతం సందర్భంగా ఆలయంలోని ఆస్థాన మండపంలో సిద్ధి, బుద్ధి సమేత వినాయక స్వామిని కొలువు తీర్చి ప్రత్యేక అభిషేకాలు, అలంకరణ చేశారు. అనంతరం ఉత్సవమూర్తులను ఆలయ అధికారులు, ఉభయదారులు మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ తీసుకొచ్చి బంగారు రథంపై కొలువుదీర్చారు. ప్రత్యేక పూజల అనంతరం ఆలయ మాడవీధుల్లో ఊరేగించారు. భక్తులు స్వామివారికి కర్పూర నీరాజనాలు సమర్పించి మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో దేవదాయశాఖ కమిషనర్ సత్యనారాయణ, చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు, సర్పంచ్ శాంతిసాగర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**భక్తులతో పోటెత్తిన ఆలయం**

కాణిపాకం ఆలయం ఆదివారం భక్తులతో కిక్కిరిసింది. సెలవు రోజు, సంకటహర చతుర్థి గణపతి వ్రతం కావడంతో వేల సంఖ్యలో తరలి వచ్చారు. దీంతో కంపార్ట్‌మెంట్లు, క్యూలు భక్తులతో నిండిపోయాయి. ఆలయం వెలుపల వరకు బారులు తీరారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ చైర్మన్ మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశు చర్యలు తీసుకున్నారు. గర్భిణులు, వయో వృద్ధులు, దివ్యాంగులు, చంటి బిడ్డల తల్లిదండ్రులను ప్రత్యేక క్యూల నుంచి స్వామివారి దర్శనం కల్పించారు.





స్వామివారిని ఊరేగింపుగా తీసుకొస్తున్న ఆలయ అధికారులు, దర్శనానికి క్యూలో వేచివున్న భక్తులు


# సక్రమంగా విధులు నిర్వర్తించండి



బోయకొండలో అభివృద్ధి పనులపై ఈఓతో చర్చిస్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి

- నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఇద్దరిపై చర్యలు
- అధిక రేట్లు వసూలు చేయొద్దు
- ఈఓ చంద్రమౌళి

చౌడేపల్లి: బోయకొండలో సిబ్బంది తమ విధులను సక్రమంగా నిర్వర్తించాలని లేనిపక్షంలో క్రమ శిక్షణా చర్యలు తప్పవని ఈఓ చంద్రమౌళి హెచ్చరించారు. ఆదివారం వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డితో కలిసి ఆయన పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. బోయకొండ గంగాపురంలోని అద్దె రూముల్లో సిబ్బంది అక్రమాలకు పాల్పడటం, అధి క ధరలు వసూలు చేయడంతోపాటు ప్రైవేటు రూ ములవారితో కుమ్మక్కై వారికి గదులు, వంట పాత్రలు అద్దెకు తీసివ్వడంపై పెద్దిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న ఇద్దరిని అక్కడ నుంచి మరొకచోటుకు బదిలీ చేశారు. అధిక రేట్లు వసూలు చేసినా, విక్రయించినా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఆలయం వద్ద జరుగుతున్న ఈఓ గది, వాహనాల పార్కింగ్ పనులను పరిశీలించారు. వర్షానికి పుష్కరిణి పొంగిపొర్లుతుందని, పరిశుభ్రతా కార్యక్రమాలకు పూనుకోవాలని సూచించారు. బోయకొండ ఆలయం వద్ద వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పర్యవేక్షణకు ఏర్పాటు చేసిన రూమును పరిశీలించారు. భక్తులకు కల్పించిన మౌలిక వసతులను పరిశీలించారు. అనంతరం అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో నేతలు సోమల మల్లికార్జునరెడ్డి, లడ్డూరమణ, సురేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.




చిత్తూరు రూరల్: చిత్తూరు మండలంలో ఆదివారం వేకువజామున భారీ వర్షం కురిసింది. వంకలు పొంగిపొర్లాయి. కాలువల నుంచి చెరువులకు వర్షపునీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. ఈ క్రమంలో చేపలు సైతం కొట్టుకొస్తున్నాయి. చేపలు పట్టేందుకు పెద్దల నుంచి చిన్నపిల్లల వరకు ఆసక్తి చూపుతున్నారు. దీంతో వంకలు, చెరువుల కట్టల వద్ద సందడిగా కనిపిస్తోంది.




## గణనాథుని సేవలో తెలంగాణ న్యాయమూర్తి



జస్టిస్ సుమలతకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఏఈఓ కృష్ణారెడ్డి

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామిని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుమలత ఆదివారం దర్శించుకున్నారు. కుటుంబ సమేతంగా వచ్చిన ఆమెకు ఆలయ ఏఈఓ కృష్ణారెడ్డి స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం ఆశీర్వాద మండపంలో వేదపండితులు ఆశీర్వచనం అందించి స్వామివారి చిత్రపటం, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ సూపరింటెండెంట్ రంగస్వామి, ఇన్‌స్పెక్టర్ సురేష్, కాణిపాకం ఎస్ఐ శ్రీనివాస్ ఉన్నారు.

## చిరుత దాడిలో లేగదూడ మృతి?



రామకుప్పం: మండలంలోని పీఎంకే తండాలో రైతు బావాజీకి చెందిన లేగదూడపై చిరుత దాడి చేసి చంపేసింది. ఇంటి ఆవరణలో కట్టి ఉంచిన దూడపై శనివారం రాత్రి చిరుత దాడి చేసినట్లు బావాజీ పేర్కొన్నారు. దీనిపై కుప్పం అటవీ క్షేత్రాధికారి వైసీరెడ్డి మాట్లాడుతూ దూడపై హైనా దాడి చేసిందన్నారు. అటవీ గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.